

అందని యాసంగి బోనస్
గత యాసంగి సీజన్‌లో సన్నరకం ధాన్యం విక్రయించిన రైతులకు మూడు నెలలు దాటినా ప్రభుత్వం బోనస్ చెల్లించలేదు. 8లో



నిధులు లేక.. 'ప్రగతి' సాగక..
15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాకపోవడంతో పట్టణాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం 31° / 24°
వాతావరణం
జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం తర్వాత ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

14న హుండీల లెక్కింపు

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆలయ హుండీలను ఈనెల 14న లెక్కించనున్నట్లు ఈఓ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల వారు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కేటీపీఎస్ ఉద్యోగికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న విజయభాస్కర్

పాల్వంచ: కేటీపీఎస్ ఉద్యోగి బూర్గుల విజయ భాస్కర్ చేస్తున్న సంఘ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విజయ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీస్తు సంపూర్ణత ఇవాంజలికల్ మిషన్ వారు సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన వారికి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ పిడుగు విజయ్‌కుమార్, సీనియర్ కన్సల్టెంట్ బి.మధు చేతుల మీదుగా విజయభాస్కర్ డాక్టరేట్ అందుకున్నారు.

ఆనాటి హామీలు ఏమాయె?



బోటింగ్ పాయింట్ నుంచి కాటేజీకి వెళ్లే రోడ్డు ఇలా..

రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు గతేడాది ఆగస్టు 12న కిన్నెరసానిలో క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చారు. బోటులో సుమారు రెండు గంటల పాటు జలాశయంలో విహరించారు. జలాశయం మధ్యలో ఉన్న 'ఆనంద ద్వీపం' కాన్సెప్టును దగ్గరి నుంచి పరిశీలించారు. బోటులోనే మధ్యాహ్న భోజనం కూడా చేశారు. అనంతరం కిన్నెరసానితో పాటు జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ముగ్గురూ హామీ ఇచ్చారు. కానీ.. ఏడాది పూర్తయినా వారి హామీల్లో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోకపోవడం గమనార్హం. దీంతో ప్రగతి భవన్ పరిపాలనైనా, ప్రజాపాలనైనా జిల్లాలో పర్యాటక రంగానికి ఒనగూరిన ప్రయోజనమేమీ లేదనే విమర్శలు వస్తున్నాయి. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



కిన్నెరసాని జలాశయం వద్ద అసంపూర్తి పనులతో అద్దాల మేడ



గతేడాది కిన్నెరసానిలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, జూపల్లి కృష్ణారావు

సా..గుతున్న పర్యాటక పనులు
- గతేడాది ఇదే రోజున కిన్నెరసానికి ముగ్గురు మంత్రులు
- అభివృద్ధి చేస్తామని అమాత్యుల భరోసా
- నేటికీ అమలుకు నోచని వాగ్దానాలు

జాడలేని వరల్డ్ బెస్ట్ కన్సల్టెన్సీ..

కిన్నెరసానిలో క్షేత్రస్థాయి పర్యటన అనంతరం డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. 'చుట్టూ పచ్చని చెట్లు, మధ్యలో విశాలమైన నీటి వనరులతో కూడిన కొండలు ఉన్నందున పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందేందుకు కిన్నెరసానికి అన్ని రకాలా అవకాశం ఉంది. అనేక కావ్యాలు, గ్రంథాల్లోనూ కిన్నెరసాని ప్రస్తావన ఉంది. ఇక్కడ అభివృద్ధి పనుల ప్రణాళిక రూపొందించే పనిని వరల్డ్ బెస్ట్ కన్సల్టెన్సీకి అప్పగిస్తాం. ఈ పనులకు సాంకేతిక ఇబ్బందులు రాకుండా ఇరిగేషన్, అటవీ, విద్యుత్, పర్యాటకంతో పాటు ఇతర శాఖలను సమన్వయం చేస్తాం' అని చెప్పారు. అయితే, ఏడాది గడిచినా ఈ విషయంలో ఎలాంటి పురోగతి లేదు. కన్సల్టెన్సీ నియామకంపై ఇప్పటివరకు ఒక్క అడుగూ పడలేదు. ఆనంద ద్వీపం కాన్సెప్టును ప్రభుత్వ పరంగా పట్టించుకున్న దాఖలాలు లేవు.

ప్రతిపాదనలు పంపితే చాలు..

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. 'ఎనిమిది టీఎంసీల సామర్థ్యం, దీవులతో కిన్నెరసాని జలాశయం అద్భుతంగా ఉంది. అవకాశాన్ని బట్టి ఎకో, వాటర్, వెడ్డింగ్ డెస్టినేషన్, రిక్రియేషన్ తదితర విభాగాల్లో టూరిజాన్ని ప్రమోట్ చేస్తాం. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపితే చాలు.. నిధులు మంజూరు చేస్తాం' అని హామీ ఇచ్చారు. అంతేకాదు.. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు పంపిస్తే సకాలంలో నిధులు మంజూరు చేస్తామని కూడా భరోసా ఇచ్చారు. కొత్త అభివృద్ధి పనుల సంగతి పక్కన పెడితే కనీసం గత ఆగస్టు నాటికే 80 శాతానికి పైగా పూర్తయిన తొమ్మిది కాటేజీలు (36 గదులు), అద్దాల మేడ పనులు కూడా ఇప్పటికీ పూర్తి చేయలేకపోయారు. మరోవైపు కిన్నెరసానిలో తీగల వంతెన, ట్రెక్కింగ్ ఏర్పాటు చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన ప్రతిపాదనలకూ ఆమోదం లభించలేదు.

పొదల్లో చిక్కుకున్న కాటేజీలు..

ఇల్లెందు క్రాస్‌రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న హరిత కాకతీయ హోటల్, హరిత కన్వెన్షన్ సెంటర్లకు సంబంధించి మిగిలిన పనులను 2024 నవంబర్ నాటికి పూర్తి చేస్తామని, ముక్కోటికి భద్రాచలం వచ్చే భక్తులు, పర్యాటకులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కానీ ముక్కోటితో పాటు శ్రీరామ నవమి పర్వదినాలు వచ్చి పోయినా ఈ రెండు పనులు నేటికీ పూర్తి కాలేదు. శిల్పాన్ని చెక్కినట్టుగా ఇక్కడ ప్రతీ పని నెలల తరబడి సాగుతోంది. ఇదే క్యాంపస్‌లో సివిల్ నిర్మాణం పూర్తయి ఇంటీరియర్ పనులు పెండింగ్‌లో ఉన్న పది కాటేజీలు (20 గదులు) సంగతి ఏంటన్న అంశంపై ఎవ్వరి దగ్గరా స్పష్టమైన సమాధానం లేదు. కాటేజీలను పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కల పొదల్లో చిక్కుకుపోయాయి.

90 శాతం పనులు అయ్యాయి

కిన్నెరసాని దగ్గర నిర్మిస్తున్న కాటేజీల్లో ఎలక్ట్రిక్ పనులు జరుగుతున్నాయి. అద్దాల మేడలో ఇంటీరియర్ పనులు జరగాల్సి ఉంది. ఇక్కడ దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. బోటింగ్ పాయింట్ నుంచి కాటేజీల వరకు నిర్మించాల్సిన రహదారికి రూ.60 లక్షల నిధులు అవసరం. హరిత కాకతీయ హోటల్ మరో రెండు వారాల్లో ప్రారంభానికి సిద్ధం అవుతుంది.
– రామకృష్ణ, పర్యాటకాభివృద్ధి శాఖ డీఈ

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

డీసీసీబీ బ్రాంచ్ ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల



డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మణుగూరు టౌన్: రైతులకు చేరువలో ఉన్న డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మణుగూరులో సోమవారం ఆయన డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయాన్ని కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, సహకార సంస్థను కూడా కాపాడుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంటూ అందరి మన్ననలు పొందేలా ఉద్యోగులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో రైతు బీమా, రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్, బోనస్ రూపంలో రూ.1.50 లక్షల కోట్లు అందించామని వివరించారు. పినపాక నియోజకవర్గంలో భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయని, ఈ ప్రాంతంలో చెరువులు, రహదారులు అభివృద్ధి చేసే అవకాశం గతంలో తనకు లభించిందని అన్నారు. మొర్రెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తయితే 25 – 30 వేల ఎకరాలకు నీరందుతుందని చెప్పారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన పులుసుబొంత ప్రాజెక్టుకు అటవీ అనుమతులు రాకపోవడంతోనే ఆలస్యం జరుగుతోందని, త్వరలోనే సీఎంను కలిసి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, సీఈఓ వెంకట ఆదిత్య, జెడ్పీ మాజీ చైర్మన్ చందా లింగయ్య, ఏఎంఎస్ నవీన్‌కుమార్, చందర్‌రావు, డీసీఓ శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ బాలరాజు, నాయకులు నవీన్, శివ, దొబ్బల వెంకటప్పయ్య, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు గాండ్ల సురేశ్, ఆవుల సర్వేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం మంత్రి తుమ్మల సీపీఐ నేత అయోధ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి పథకాలు

ఐటీడీఏ పీఓ రాహుల్



గిరిజనులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ నిర్వహించగా.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దర్బార్‌కు వచ్చే గిరిజనులను మర్యాదపూర్వకంగా స్వాగతించాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పథకాలు గిరిజనుల చెంతకు చేరేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. అర్జీదారులు సైతం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, గురుకులాల ఆర్‌సీఓ అరుణకుమారి, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ హరీశ్, ఏడీఎంహెచ్‌ఓ సైదులు, ఏఓ సున్నం రాంబాబు, ఎస్‌ఓ భాస్కర్, ఏపీఓ వేణు, ఆర్‌ఓఎఫ్ఆర్ డీటీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెలవులకు ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!

ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సెలవులకు ఊరెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ రోహిత్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15,16,17 తేదీల్లో వరుస సెలవులు ఉండటంతో చోరీ చేసేందుకు దొంగలు ప్రయత్నిస్తారని పేర్కొన్నారు. చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. ఊరికి వెళ్లేవారు ముందస్తుగా సమీపంలోని పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, చిరునామా, ఫోన్‌నంబర్ ఇవ్వాలని సూచించారు. బంగారు నగలు ఉంటే బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని కోరారు. సింగరేణి, కేటీపీఎస్, ఐటీసీ, నవభారత్, బీటీపీఎస్‌లకు చెందిన ఉద్యోగుల కాలనీల్లో, గేటెడ్ కమ్యూనిటీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తే సమీప పోలీసు స్టేషన్‌లో, జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ నంబర్ 87126 82128కు, డయల్ 100కు సమాచారం అందజేయాలని కోరారు.

స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



ప్రజావాణిలో సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రగతిమైదానంలో నిర్వహించే స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అన్ని శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం దృష్ట్యా వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని, వేడుక ప్రాంగణంలో 108 అంబులెన్స్, వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని, ఆయా శాఖల పనితీరుకు అద్దం పట్టేలా స్టాళ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనల్లో దేశభక్తి, జాతీయభావం ఉట్టిపడేలా ఉండాలన్నారు. శాఖల వారీగా ప్రశంసాపత్రాలు అందించేలా గడువులోగా పేర్లు అందించాలని సూచించారు.

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి..

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీ, అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతినెలా ఆయా పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాజకీయ పార్టీలు బూత్‌లెవెల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో హడావుడి చేయకుండా ముందుగానే పోలింగ్ కేంద్రాలలో సదుపాయాలు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి వాటిపై లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి..

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. చుంచుపల్లి మండలానికి చెందిన కాకాటి అనూష.. ల్యాండ్ సర్వేయర్ అప్రెంటిస్ నిమిత్తం తనను ఆళ్లపల్లి మండలానికి కేటాయించారని, ఏడాది వయసున్న పాపతో అంతదూరం వెళ్లలేకపోతున్నానని, చుంచుపల్లి మండలానికి సమీపంలో కేటాయించాలని దరఖాస్తు చేయగా భూమి, కొలతల శాఖకు ఎండార్స్ చేశారు. ములకలపల్లి మండలం ఒడ్డు రామవరం అంగన్‌వాడీ స్కూల్ కాలనీలో బోరు చెడిపోయిందని, మిషన్ భగీరథ నీరు కూడా రావడం లేదని ఫిర్యాదు చేయగా మిషన్ భగీరథ ఈఈకి ఎండార్స్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ట్రైనీ కలెక్టర్ సౌరబ్‌శర్మ, అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్డీఓ మధు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్లు ముజాహిద్, రంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుమారుడు పట్టించుకోవడం లేదు..

సూపర్‌బజార్(కొత్తగూడెం) : తన భర్త ఉద్యోగం తీసుకున్న పెద్ద కుమారుడు ఇప్పుడు తనను పట్టించుకోవడం లేదని సుజాతనగర్‌కు చెందిన 78 ఏళ్ల గండమాల కమలమ్మ ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. తమకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారని, తన భర్త సామేలు ఆర్‌అండ్‌బీలో గ్యాంగ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ 1993లో వీఆర్‌ఎస్ తీసుకుని పెద్ద కుమారుడు వెంకటేశ్వర్లుకు అటెండర్ ఉద్యోగం ఇప్పించాడని తెలిపింది. తనకు పక్షవాతం, గుండె నొప్పితో పాటు ఇటీవల కాలు విరిగితే రూ 6.5లక్షలు ఖర్చయ్యాయని, ఆ అప్పులకు వడ్డీ కూడా చెల్లించలేకపోతున్నానని వాపోయింది. చికిత్సకు రూ 3.25 లక్షలు ఇస్తానని ఒప్పుకుని కుమారుడు అవి కూడా ఇవ్వలేదని, తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకుంది.

గిరిజనుడికి అన్యాయం జరుగుతోంది

ఇల్లెందు: ఇల్లెందు మండలం సుభాష్‌నగర్‌కు చెందిన పూనెం సూరయ్య అనే గిరిజనుడికి ఐదెకరాల స్థలం ఉంటే అందులో నాలుగెకరాలు కొందరు ఆక్రమించుకుని ఇళ్లు కట్టుకున్నారని, మిగిలిన ఎకరం కూడా ఆక్రమించుకుంటున్నారని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ధన, రాజకీయ బలంతో అక్రమంగా ఆదివాసీల భూములు లాక్కుంటున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. విజయలక్ష్మి నగర్‌లో గొగ్గెల ఆదిలక్ష్మికి చెందిన ఐదెకరాల్లోనూ కొందరు గిరిజనేతరులు అక్రమంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారని, దీనిపైనా విచారణ చేపట్టాలని వినతిపత్రం ఇచ్చారు.

కేజీబీవీలకు ఆదరణ..

- కస్తూర్బా కళాశాలల్లో పెరిగిన అడ్మిషన్లు
- ఫలితమిచ్చిన ఇంటింటి ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 8,234 మంది చేరిక
- మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 15 వరకు అవకాశం



పాల్వంచలోని కస్తూర్బాగాంధీ జూనియర్ కళాశాల

పాల్వంచరూరల్ : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. కేజీబీవీల్లో చదివే విద్యార్థినులకు ఉచిత భోజనం, వసతి, దుస్తులు ఇవ్వడంతో పాటు నాణ్యమైన బోధన అందుతోంది. గత వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఇంటింటికీ తిరిగి ఈ మేరకు ప్రచారం కల్పించారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 28 కస్తూర్బాగాంధీ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఈ ఏడాది 8,234 అడ్మిషన్లు నమోదయ్యాయి. జిల్లాలోని 14 విద్యాలయాల్లో అడ్మిషన్లు ఆశాజనకంగా ఉన్నాయని జీసీడీఓ అన్నామణి తెలిపారు. కొన్ని కళాశాలల్లో కొంత తగ్గినా.. మొత్తంగా చూస్తే ప్రవేశాల సంఖ్య పెరిగిందని వివరించారు.

జిల్లాలోని కస్తూర్బా కళాశాలల్లో గత, ప్రస్తుత విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల వివరాలిలా..

	2024-25	2025-26
అళ్లపల్లి	261	245
అన్నపురెడ్డిపల్లి	333	333
భద్రాచలం	277	254
బూర్గంపాడు	276	250
చండ్రుగొండ	307	305
చర్ల	156	165
దుమ్ముగూడెం	239	227
గుండాల	247	249
జూలూరుపాడు	266	252
కరకగూడెం	289	299
ములకలపల్లి	302	342
పాల్వంచ	308	336
పినపాక	247	276
టేకులపల్లి	172	186
మొత్తం	3,680	3,719

ఉమ్మడి జిల్లాలో 544 సీట్లు ఖాళీ..

ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య పెరిగినా ఉమ్మడి జిల్లా కేజీబీవీల్లో ఇంకా 544 సీట్లు ఖాళీగా ఉన్నాయి. వీటిలో భద్రాద్రి జిల్లా ఆళ్లపల్లిలో 49, అన్నపురెడ్డిపల్లి 30, భద్రాచలం 37, బూర్గంపాడు 11, చండ్రుగొండ 20, చర్ల 32, దుమ్ముగూడెం 25, గుండాల 10, జూలూరుపాడు 11, కరకగూడెం 30, ములకలపల్లి 10, పాల్వంచ 10, పినపాక 40, టేకులపల్లి 44 సీట్లు ఉండగా ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో 23, పెనుబల్లి 34, సింగరేణి 20, లింగాల 24, బోనకల్ 24, కూసుమంచి 23, ఏన్కూర్ 14, కొణిజర్ల 15, ముదిగొండ 8 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

15 వరకు స్పాట్ అడ్మిషన్లు



కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి డీఈఓ ఆదేశాల మేరకు ఈనెల 15 వరకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తాం. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెల మొదటి వారంలో కూడా స్పాట్ అడ్మిషన్లు నిర్వహించడంతో గతేడాది కంటే విద్యార్థినుల సంఖ్య పెరిగింది.
– ఎం.తులసి, సమగ్రశిక్షా అభియాన్ జీసీడీఓ, ఖమ్మం

పెద్దమ్మతల్లికి చీర, సారె సమర్పణ

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కాగా, సోమవారం కొత్తగూడేనికి చెందిన రామడుగు బేబీతో పాటు పలువురు మహిళలు అమ్మవారికి చీర, సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణం చేశారు. ప్రతీ సంవత్సరం శ్రావణమాసంలో ఇలా సమర్పించడం ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రజనీకుమారి, పాలక మండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో చీర, సారెలతో భక్తులు

క్లుప్తంగా

ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి 13 వరకు అవకాశం

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లిలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో ప్రవేశానికి ఈనెల 13వ తేదీ వరకు అవకాశం ఉందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పూర్ణచందర్‌రావు, సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, డిప్లొమా రెండు సంవత్సరాల కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ సంవత్సరం నుంచి గిరిజన విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'డబుల్' ఇల్లు రాలేదని నిరసన

భద్రాచలంఅర్బన్: డబుల్ బెడ్ రూం ఇల్లు రాలేదని ఓ మహిళ సోమవారం ఆవేదన వ్యక్తం చేసింది. పట్టణంలోని మనబోతుల చెరువు ప్రాంతంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిరుపేదలకు కేటాయించారని పేర్కొంది. జాబితాలో తన పేరు ఉన్నా ఇల్లు మరొకరికి కేటాయించారని సరిత అనే మహిళ వాపోయింది. సోమవారం పెట్రోల్ బాటిల్‌తో మనబోతుల చెరువు వద్ద ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని నిరసన తెలిపింది. నిరుపేద అయిన తనకు ఇల్లు ఇవ్వలేదని పేర్కొంది. కొందరు డబుల్ బెడ్ రూం ఇళ్లను రూ.3 లక్షలకు అమ్ముకుంటున్నారని ఆరోపించింది.

కాంట్రాక్ట్ కార్మికుడికి గాయాలు

మణుగూరు టౌన్ : మణుగూరులోని ఓ ఓబీ కంపెనీలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుడికి గాయాలైన సంఘటన సోమవారం జరిగింది. దుర్గా ఓబీ కంపెనీలో పనిచేసే ఆపరేటర్ దినేశ్ కుమార్ ఓబీ లోడ్‌తో వెళ్తుండగా, వాహనం ఒకవైపు ఒరిగి త్రుటిలో ప్రమాదం తప్పింది. స్వల్పగాయాలు కావడంతో ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుడిని ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ రాంగోపాల్ పరామర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఓబీ కంపెనీల్లో ప్రమాదాలపై యాజమాన్యం దృష్టి సారించాలని కోరారు.

నాటిక పోటీల్లో విజేత.. 'ఖరీదైన జైళ్లు'



బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలో నాలుగురోజుల పాటు జరిగిన తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీల్లో విజేతల వివరాలను నిర్వాహకులు ప్రకటించారు. కరీంనగర్ చైతన్యభారతి కళాసంస్థ ప్రదర్శించిన ఖరీదైన జైళ్లు, హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారు ప్రదర్శించిన అమ్మ చెక్కిన బొమ్మ, తాడేపల్లికి చెందిన అరవింద్ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన విడాకులు కావాలి నాటికలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. మొత్తం తొమ్మిది నా టికలు ప్రదర్శించగా రంగస్థల నటులు సుబ్బ రాయ శర్మ, మేక రామకృష్ణ, గోవిందరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈమేరకు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన నాటికలు ప్రదర్శించిన సంస్థలు, ఉత్తమ దర్శకులు, నటులకు బహుమతలు అందజేశారు. నిర్వాహకులు అన్నాబత్తుల సు బ్రహ్మణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, దేవేంద్ర, డాక్టర్ నాగబత్తిని రవి, వేల్పుల విజేత, నామ లక్ష్మీనారాయణ, వేముల సదానందం తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

అందని యాసంగి బోనస్

- నన్నరకాల ధాన్యం బోనస్ బకాయి రూ.18.34 కోట్లు
- మూడు నెలలుగా ఎదురుచూస్తున్న రైతులు

బూర్గంపాడు: గత యాసంగిలో పండించిన సన్నరకం ధాన్యం విక్రయించి మూడు నెలలు దాటింది. వానాకాలం సీజన్ నాట్లు ముగింపు దశకు చేరాయి. అయినా ప్రభుత్వం బోనస్ ఇవ్వలేదు. దీంతో రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో గత యాసంగిలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో 55,243 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో 36,950 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం ఉంది. ప్రభుత్వం మద్దతు ధర సన్నరకాలకు క్వింటాల్‌కు రూ. 2,320లు, దొడ్డురకాలకు రూ.2,300 చెల్లించింది. క్వింటాల్‌కు రూ.500 చొప్పున ఇస్తానని చెప్పిన బోనస్ మాత్రం రైతు ఖాతాల్లో జమ చేయలేదు. జిల్లాలో రూ.18.34కోట్ల బోనస్ బకాయి చెల్లించా ల్సి ఉంది. గత వానాకాలం పండించిన సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం నూరుశాతం బోనస్ అందించింది. అదే నమ్మకంతో యాసంగిలో కూడా రైతులు సన్నరకం వరిని సాగు చేశారు. దొడ్డు రకాల కంటే సన్నరకాలకు ఎక్కువ పెట్టుబడి పెట్టాలి. ఎరువులు అధికంగా వేయాలి. చీడపీడలు, దోమ నివారణ, పురుగుల నివారణకు అధికంగా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. ఎకరాకు రూ. 8 వేల వరకు అదనపు పెట్టుబడి అవుతుంది. యాసంగిలో సన్నరకాలు ఎకరాకు 35 బస్తాల దిగుబడి వస్తే, దొడ్డురకాలు 40నుంచి 45బస్తాల వరకు దిగుబడి వస్తాయి. అయినా బోనస్ అందిస్తామనే ప్రభుత్వ ప్రకటనతో రైతులు సన్నరకాలను సాగు చేశారు. దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లు రెండేళ్లుగా మందకొడిగా సాగుతుండటం వల్ల కూడా సన్నరకాల వైపు మొగ్గు చూపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన పదిరోజుల్లో నగదు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమైంది. కానీ బోనస్ మాత్రం ఇంతవరకు రాలేదు. ఎప్పుడు ఇస్తారనే విషయమై అధికారుల నుంచీ స్పష్టత లేదు. వానాకాలం వరినాట్లకు ఉపయోపడుతుందని ఆశించిన రైతులు బోనస్ అందకపోవడంతో నిరాశ చెందుతున్నారు.



బూర్గంపాడులోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం లోడ్ చేసిన లారీ(ఫైల్)

రూ.60వేల బోనస్ రావాలి

యాసంగిలో 120 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం అమ్మినాను. నాకు రూ. 60 వేల బోనస్ రావాలి. వడ్లు అమ్మి వందరోజులు దాటినా బోనస్ పడలేదు. ఆ డబ్బులు వానాకాలం నాట్లకు అక్కరకు వస్తాయనుకున్నాను.

–వెలమ రమేష్, రైతు, మల్లెలమడుగు, అశ్వాపురం మండలం

ఎప్పుడు జమవుతుందో చెప్పలేం..

యాసంగిలో కొనుగోలు చేసిన సన్నరకం ధాన్యానికి సంబంధించిన రైతుల బ్యాంకు ఖాతాలను ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం నిర్ణయం మేరకు రైతుల ఖాతాల్లోనే బోనస్ నగదు జమవుతుంది. ఎప్పుడు జమవుతుందో కచ్చితంగా చెప్పలేం.

–రుక్మిణిదేవి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

ఆర్టీసీకి కలిసొచ్చింది..



వరుస సెలవులతో ప్రయాణికుల రద్దీ

- నాలుగు రోజుల్లో రూ.1.21 కోట్ల ఆదాయం
- అత్యధికంగా మధిర నుంచి రూ.29.84 లక్షలు



రాఖీ పండుగ రోజు ఖమ్మం పాతబస్టాండ్‌లో రద్దీ

ఖమ్మంమయూరిసెంటర్: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమి రెండో శనివారం.. ఆ తర్వాత ఆదివారం కావడంతో జనమంతా ఊర్ల బాట పట్టడం ఆర్టీసీకి కలిసొచ్చింది. ఈనెల 7నుంచి 10వ తేదీ వరకు ఆర్టీసీ ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల ద్వారా 374 బస్సులు నడిపించారు. ఆ బస్సుల్లో తద్వారా లక్షలాది మందిని గమ్యస్థానాలకు చేర్చడంతో కాసుల పంట పండింది.

ప్రణాళికాయుతంగా..

ఈనెల 8న శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం జరుపుకోగా విద్యాసంస్థలకు ఆప్షనల్ హాలీడే ఇచ్చారు. ఆ మరుసటి రోజు రాఖీ పండుగ, ఆపై ఆదివారం కలిసొస్తుండడంతో చాలా మంది 7వ తేదీనే సొంత ఊర్లకు పయనమయ్యారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఈనెల 7, 8, 9వ తేదీల్లో హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోలకు ప్రత్యేక బస్సులను నడిపారు. ఇక 9వ తేదీన హైదరాబాద్‌తో పాటు జిల్లాలో రద్దీ ఉన్న ప్రాంతాలకు ని బస్సులను తిప్పారు. అంతేకాక 10వ తేదీ ఆదివారం ఉమ్మడి జిల్లా నుంచి హైదరాబాద్‌కు తిరుగుప్రయాణం అయ్యేవారి కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడిపిస్తూ బస్టాండ్లలో అదనపు సిబ్బంది ద్వారా పర్యవేక్షించడంతో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాలేదు.

నాలుగు రోజుల్లో డిపోల వారీగా ఆదాయం (ప్రత్యేక సర్వీసుల ద్వారా)

డిపో	కిలోమీటర్లు	ఆదాయం (రూ.లక్షల్లో)
మధిర	42,316	29.84
భద్రాచలం	42,958	25.81
ఖమ్మం	38,022	20.99
సత్తుపల్లి	26,122	15.58
మణుగూరు	24,096	12.05
కొత్తగూడెం	15,155	9.16
ఇల్లెందు	11,797	7.88
రీజియన్	2,00,466	121.35

రద్దీలోనూ మహాలక్ష్మి

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు విపరీతమైన రద్దీలోనూ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని విజయవంతంగా అమలు చేశారు. రక్షా బంధన్ పండుగ రోజు రీజియన్ వ్యాప్తంగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 1.50 లక్షల మంది మహిళామణులు ప్రయాణించారు. ఈరోజు మొత్తంగా మొత్తం 2లక్షల మందికి పైగా ప్రయాణికులను రాకపోకలు సాగించారు. ఇక ఆదివారం అదనంగా 137 సర్వీసులు నడింపించారు. కాగా, రీజియన్‌కు రికార్డ్ స్థాయిలో కేవలం ప్రత్యేక సర్వీసుల ద్వారానే రూ.1.21 కోట్ల ఆదాయం నమోదుకాగా.. అత్యధికంగా మధిర నుంచి రూ.29.84 లక్షల ఆదాయం సమకూరింది.

రద్దీకి అనుగుణంగా సర్వీసులు

రాఖీ పండుగ, మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యాన ప్రయాణికులకు ఇబ్బంది రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం. ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలను అందించాలని ఉద్యోగులకు సూచనలు చేశాం. డిప్యూటీ ఆర్ఎం, డిపో మేనేజర్లతో పాటు నేను కూడా బస్టాండ్లలో పర్యవేక్షిస్తూ రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటుచేయడంతో ఏ సమస్యా రాలేదు.

– ఏ.సరిరామ్, ఆర్ఎం, ఖమ్మం రీజియన్

22 తులాల బంగారం స్వాధీనం

- ఇద్దరు నిందితులు అరెస్ట్
- భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

కొత్తగూడెంటౌన్: పోలీసులు భారీచోరీ కేసును ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. సోమవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ వెల్లడించిన వివరాలు ఇలా.. రుద్రంపూర్ నాలేరియాకు చెందిన సింగరేణి ఉద్యోగి వాకపల్లి వెంకటరమణ ఇంట్లో ఈ నెల 4న చోరీ జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఆదివారం ఫోర్ ఇంక్లైన్ ఏరియాలో సీఐ డి.ప్రతాప్, ఎస్సైలు కిషోర్, మనీషా, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ గ్రామానికి చెందిన నారసాని రమేష్, కొత్తగూడెం మేదరబస్తీ గొల్ల గూడేనికి చెందిన ఓర్సు కుమార్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి విచారించగా సింగరేణి ఉద్యోగి ఇంట్లో చోరీ చేసినట్లు అంగీకరించారు. నిందితుల నుంచి 22 తులాల బంగారం, రూ.2,78,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. నారసాని రమేష్ చోరీ కేసులోనే గతంలో జైలుకు వెళ్లి వచ్చాడు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసు ఛేదించిన టూటౌన్ పోలీసులకు, బ్యాక్‌గ్రౌండ్ సపోర్టు ఇచ్చిన సీసీఎస్ పోలీసులకు డీఎస్పీ రివార్డులను అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో టూటౌన్ సీఐ ప్రతాప్, సీసీఎస్ సీఐ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తదితరులు

పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న బాధిత కుటుంబీకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

టేకులపల్లి: గుడుంబాలో కల్తీ వల్లే తన కుమారుడు మృతి చెంది ఉంటాడని, పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని మృతుడి తండ్రి ఆర్ఎంపీ యనగంటి అర్జున్‌రావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి టేకులపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన కుమారుడు ఆర్ఎంపీ రవికాంత్ గత నెల 27న కొందరు స్నేహితులతో కలిసి మండల కేంద్రంలోని బోడ బజారులో ఓ ఇంట్లో గుడుంబా తాగాడని పేర్కొన్నారు. ఈ గుడుంబా విక్రయించే కుటుంబం గతంలో రవికాంత్‌తో తీవ్ర స్థాయిలో గొడవ పడ్డారని తెలిపారు. గత నెల 27న ముఖానికి మాస్కు ధరించిన ఇద్దరు వ్యక్తులు తన కుమారుడిని తీసుకొచ్చి, ఇంటి ముందు వదిలేసి వెళ్లినట్లు స్థానికులు చెప్పారని తెలిపారు. గుడుంబాలో కల్తీ వల్లే తమ కుమారుడు మృతి చెంది ఉంటాడని, పోలీసులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మెంతెన ప్రభాకర్, నల్లగట్ల వెంకన్న, జినక ఇస్తారి, సతీష్, వెంకన్న పాల్గొన్నారు.

అనారోగ్యంతో పదో తరగతి విద్యార్థిని మృతి



లౌఖిక(ఫైల్)

అశ్వారావుపేటరూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ విద్యార్థిని సోమవారం మృతిచెందింది. స్థానికుల కథనం ప్రకారం..అశ్వారావుపేటలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పేటమాలపల్లికి చెందిన ఎస్. లౌఖిక(14) కొద్దిరోజులుగా ఫిట్స్‌తో బాధపడుతోంది. కుటుంబీకులు ఓ వైద్యశాలలో చికిత్స చేయించారు. సోమవారం ఉదయం కూడా ఫిట్స్ రాగా, ఆస్పత్రికి తరలించేలోపే పరిస్థితి విషమించి మృతి చెందింది. పాఠశాల హెచ్ఎం పి.హరిత, ఉపాధ్యాయులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబీకులకు సానుభూతి ప్రకటించారు. విద్యార్థిని మృతితో పాఠశాలకు సెలవు ప్రకటించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

దమ్మపేట: భార్య మందలించిందనే కారణంగా ఆత్మన్యూనతా భావంతో కలుపు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పట్వారీగూడెం గ్రామానికి చెందిన సింగిచ్చి ఏసురాజు(48) కొంతకాలంగా మద్యానికి బానిసగా మారి కుటుంబ పోషణను పట్టించుకోవడం లేదు. దీంతో విసుగుచెందిన భార్య కృష్ణవేణి శనివారం అతడిని మందలించింది. క్షణికావేశంలో ఏసురాజు కలుపు మందు తాగి, ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని అదనపు ఎస్సై బాలస్వామి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కౌలు రైతు..



మంగయ్య(ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని గోపాలపురం గ్రామం వద్ద మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై ఆది వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కౌలు రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని సర్వాయిపాడు బంజర గ్రామానికి చెందిన రైతు సోడే మంగయ్య(36) మణుగూరు మండలం కూనవరంలో భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. రోజూ ఉదయం పొలానికి రాత్రి ఇంటికి వస్తాడు. ఆదివారం కూడా పొలానికి వెళ్లి ఎరువులు చల్లాడు. రాత్రి బైక్‌పై ఇంటికి వస్తుండగా గోపాలపురం వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టడంతో మంగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం భద్రాచలం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై మధుప్రసాద్ కేసు నమోదుచేశారు.

ఖమ్మంలో డెంగీ కలవరం

15 రోజుల్లో 10 కేసుల నమోదు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలో డెంగీ కేసులు పెరుగుతుండడంతో అటు అధికారులు, ఇటు ప్రజల్లో ఆందోళన మొదలైంది. గత 15 రోజుల్లోనే నగరంలోని వివిధ ప్రాంతాల్లో పది కేసులు నమోదైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. డెంగీ జ్వరంతో ఉన్న వ్యక్తిని కుట్టిన దోమ మరొకరిని కుట్టడంతో కేసుల సంఖ్య పెరుగుతోందని చెబుతున్నారు. ఈనెల 7వ తేదీన ఒకేరోజు ఐదు కేసులు నమోదు కావడం గమనార్హం. అయితే, 8వ తేదీ తర్వాత నివేదికలు అందితే కేసుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని సమాచారం. ఈ నేపథ్యాన అధికారులు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో యాంటీ లార్వా టిమోపాస్ స్ప్రే చేయిస్తున్నారు. అలాగే, ఇంటింటికీ వెళ్లి నిల్వ నీటిని పడబోయిస్తున్నారు. డెంగీ కేసులు నమోదైన ఇళ్ల చుట్టూ 60 ఇళ్లలోని వారిని పరీక్షించడంతో పాటు దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నారు.

టేబుల్ టెన్నిస్ ఉమ్మడి జల్లా జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ జట్లను ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో సోమవారం ఎంపిక చేశారు. ఈమేరకు జట్ల వివరాలను టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, వీవీఎస్.సాంబమూర్తి తెలిపారు. అండర్–11 బాలుర జట్టులో అనుమోలు శ్రేయన్, జాయ్, ఈశ్వర్, హేమంత్ సాయి, నిహాల్ కృష్ణ, యశ్వంత్, రోషన్, బాలికల జట్టుకు బాలసాని హర్వికలక్ష్మి, పి.ఆరాధ్య, తోట జిజ్ఞాస, రోస్మిత, అండర్–13 బాలికల జట్టులో పర్స వంషిక, బాలసాని తన్మయిశ్రీ, బొంతు సాయిశివాని, బాలుర జట్టులో కోటగిరి హితేష్ శ్రీరంగా, ఈ.హరి, అభిలాష్, అన్వేష్, సాయి హర్షిత్ ఎంపికయ్యారని వెల్లడించారు. అలాగే, అండర్–15 బాలికల జట్టులో హర్షిత, అఖిల, స్పందన చంద్ర, చిలకబత్తిన పావని, బాలురు జట్టుకు షేక్ సాహెల్ ఫజల్, జి.చార్విక్, ఈ.తరుణ్, ఏ.ఉజ్వల్, ప్రజ్ఞ, అండర్–17 బాలురు జట్టుకు పరిటాల జ్వలిత్, పిట్టల మోహిత్ కృష్ణ, రామ్ సాకేత్, రణధీర్‌రెడ్డి, సైఫ్, అనస్, బాలికల జట్టులో గద్దల సిరి, పి.అమత, జి.చంద్రికరాణి, షర్మిలరాణి, సుప్రియ ఎంపికయ్యారని తెలిపారు. ఆయా జట్లు ఈనెల 22నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటాయని వెల్లడించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: మద్యంతో మత్తులో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ట్రైనీ ఎస్సై అఖిల కథనం ప్రకారం.. మండలంలోని తిరుమలకుంట కాలనీ గ్రామానికి చెందిన పూనెం నాగేశ్వరరావు(55) కొద్ది రోజులుగా అతిగా మద్యం తాగుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కూడా మద్యం తాగి ఇంటికి రాగా, భార్య కుమారి మందలించింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో నుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగాడు. కొద్ది సేపటి తర్వాత తిరిగి ఇంటికి రాగా, గమనించిన కుటుంబీకులు స్థానిక గ్రామీణ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుమారుడు ముత్యాలరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్సై వెల్లడించారు.

నిధులు లేక.. 'ప్రగతి' సాగక..

పట్టణాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి

- 2023 ఏప్రిల్ నుంచి నిలిచిన నిధులు
- కేవలం ఆర్థిక సంఘం నిధులే దిక్కు..
- కార్మికుల వేతనాలకే సరిపోతున్న మున్సిపల్ ఆదాయం

ఇల్లెందు: పట్టణాలను అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేసిన పట్టణ ప్రగతికి 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా అభివృద్ధి ఆగిపోయింది. గత ప్రభుత్వం పట్టణ ప్రగతి కార్యక్రమం చేపట్టింది. ప్రతీ మున్సిపాలిటీకి జనాభా ఆధారంగా నిధులు మంజూరు చేయగా.. శానిటేషన్ పనులు ముమ్మరంగా సాగాయి. ప్రారంభంలో ఇల్లెందు మున్సిపాలిటీకి రూ. 25 లక్షలు నిధులు కేటాయించారు. 2023 ఏప్రిల్ నుంచి నిధులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి మున్సిపాలిటీలు అస్తవ్యస్తంగా మారాయి.



ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం

ఆగిన నిధుల వివరాలిలా..

మున్సిపాలిటీ	నిధులు(రూ.లక్షల్లో)
ఇల్లెందు	రూ. 12,00,743
ఖమ్మం	రూ.1,02,30,766
సత్తుపల్లి	రూ.12,21,197
మధిర	రూ.12,53,413
వైరా	రూ.12,25,778
కొత్తగూడెం	రూ.28,00,097
మణుగూరు	రూ.12,23,162
పాల్వంచ	రూ.30,60,485


ప్రతి నెలా నిధులతో ఇలా..

పట్టణ ప్రగతి ప్రణాళికలు రూపొందించి పట్టణంలోని ప్రధాన కూడళ్ల అభివృద్ధి, హరితహారం, సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీలు, భవన నిర్మాణాలు, చిట్టడవులు, నర్సరీలు, చిల్డ్రన్ పార్కులు, పట్టణ ప్రకృతి వనాలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మరుగుదొడ్ల నిర్మాణం, స్వచ్ఛ ఆటోలు, ఫౌంటేన్, వెండర్ జోన్ల అభివృద్ధి పనులు చేపట్టారు.

అత్యధిక నిధులు కార్మికుల వేతనాలకే..

ఇల్లెందు వంటి మున్సిపాలిటీలో ఇతర ఆదాయాలు రాబడి లేనందున పాలన సాగడం కష్టంగా మారింది. ప్రతి నెలా మున్సిపాలిటీలో పని చేసే కార్మికులకు వేతనాల కోసం రూ. 25 లక్షల వరకు నిధులు అవసరమవుతున్నాయి. పట్టణంలో లైసెన్సులు, ఆస్తి పన్నులు, ఇతర ఆదాయాల ద్వారా సమకూరిన నిధులు కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి సరిపోతున్నాయి. ఇతర అభివృద్ధి పనులు ముందుకు సాగాలంటే పట్టణ ప్రగతి నిధులు, ఆర్థిక సంఘం నిధులు, ఎస్‌డీఎఫ్, ఎమ్మెల్యే, ఎంపీల నిధులు విడుదల చేయాలని పట్టణాల ప్రజలు కోరుతున్నారు. కేవలం ఆర్థిక సంఘం నిధులు మినహా ఇతర ఏ నిధులూ విడుదల చేయకపోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి.

వేతనాల కోసం పాట్లు..



మున్సిపాలిటీలో కార్మికుల వేతనాలు వెళ్లదీయడం కోసం పాట్లు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఉద్యోగుల వేతనాలు నేరుగా అందజేస్తే ఇక్కడి పన్నుల మీద వచ్చే ఆదాయంతో పట్టణంలో ఏదైనా అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉండేది. నిధులు లేని కారణంగా ఏ పనీ సక్రమంగా చేయలేకపోతున్నాం. పట్టణ ప్రగతి నిధులు విడుదలైతే ఎంతో మేలు జరిగేది.

– సీహెచ్.శ్రీకాంత్, ఇల్లెందు మున్సిపల్ కమిషనర్

43 కిలోల గంజాయి సీజ్



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

భద్రాచలంటౌన్: ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సీహెచ్ శ్రీహరిరావు కథనం ప్రకారం.. భద్రాచలంలోని కూనవరంరోడ్డులో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన కారును ఆపి తనిఖీ చేయగా 43 కిలోల గంజాయి లభించింది. దీంతో వాహనంలో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఒడిశా రాష్ట్రం పాడువకు చెందిన సురేంద్ర సింగ్ రాజ్‌పుత్‌గా తేలింది. నిందితుడిని అరెస్ట్ చేసి భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. గంజాయి, కారును సీజ్ చేశారు. మరో ఘటనలో ద్విచక్ర వాహనంపై 13 లీటర్ల నాటు సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక లారీ సీజ్



పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

దమ్మపేట: ఆంధ్రా నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని దమ్మపేట పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఏపీలోని రాజమండ్రి నుంచి టిప్పర్ ద్వారా దమ్మపేటకు తరలించి, ఓ ఖాళీ ప్రదేశంలో ఇసుక అన్‌లోడ్ చేస్తుండగా పట్టుకున్నారు. లారీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసునమోదు చేసినట్లు అదనపు ఎస్సై బాలస్వామి తెలిపారు.